

వాల్మీకి కార్పొరేషన్ అవినీతిలో డీకేకు వాటా: ఎమ్మెల్యే

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు భాగం ఉందని టీ. దాసరహళ్లి బీజేపీ ఎమ్మెల్యే మునిరాజు సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మౌలిక సదుపాయాల పనుల్లో డీకే శివకుమార్‌కు 8 శాతం కమీషన్ ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులకు 18 శాతం జీఎస్టీ, 2శాతం సెస్సు, 2శాతం పన్ను, 8 శాతం డీకే శివకుమార్‌కు మరో విధమైన పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రాంటులో 30శాతం కమీషన్లు, పన్నులకే పోతే నాణ్యమైన పనులు ఎలా సాధ్యమన్నారు.



ఫ్రీడం పార్కు నిరసనలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు

ఎన్నికల్లో ఓడితే.. ప్రజలపై భారం వేస్తారా..?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ మండిపాటు
- పెట్రో ధరల పెంపుపై నిరసన
- కేంద్రాన్ని నిలదీసే సత్తా ఉందా? : సీఎం



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్ష నేత అశోక్ తదితరులు



పాడెమోస్తూ నిరసన...

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓడిపోతే ప్రజలపై భారం మోపుతారా..? అంటూ ప్రతిపక్షనేత ఆర్.అశోక్ విరుచుకుపడ్డారు. ప్రభుత్వం లీటరు పెట్రోల్‌పై రూ.3, డీజిల్‌పై రూ.3.50 పెంచుతూ నిర్ణయం తీసుకున్న మేరకు ప్రతిపక్ష బీజేపీ నిరసనకు దిగింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. బెంగళూరులోని ఫ్రీడంపార్కులో జరిగిన నిరసనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, నాయకులు సీటీ రవి, అశ్వత్థనారాయణ, రవికుమార్, ఎమ్మెల్యే రామమూర్తి, ఎస్.రఘు, మునిరత్నతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో గ్యారెంటీల ముసుగులో మోసం చేయాలని భావించారని, ప్రజలు తిప్పికొట్టారన్నారు. 20 స్థానాల్లో గెలుపొందుతామని భావించిన కాంగ్రెస్‌ను తొమ్మిది స్థానాలకే పరిమితం చేశార అన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై భారం మోపారన్నారు. గ్యారెంటీలతో అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని, మహిళాశక్తికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పుకున్న ప్రభుత్వం ఏకంగా పెట్రోల్, డీజిల్‌పై ఒకేసారి పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విజయేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలపై భారీగా పన్నుల మోపారని అన్నారు. ఉగ్రవాదులు కుక్కర్‌బాంబులు, హోటళ్లలో బాంబులు పేల్చితే కాంగ్రెస్ ప్రభుత్వం ధరల బాంబు పేల్చిందని మండిపడ్డారు. అంతకు ముందు శవయాత్రను నిర్వహించి నిరసన తెలిపారు. ఎడ్లబండిపై ఊరేగింపుతో విధానసౌధ ముట్టడికి యత్నించగా పోలీసులు అరెస్టు చేశారు. మైసూరు, మంగళూరుతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ బీజేపీ నిరసన చేపట్టింది.

కేంద్రాన్ని నిలదీసే సత్తా ఉందా.? : సీఎం

పదేళ్ల నరేంద్రమోదీ పాలనలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సిలిండర్ ధరలు రెండింతలు పెంచారని, వాటిని ప్రశ్నించే సత్తా రాష్ట్ర బీజేపీ నాయకులకు లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. బీజేపీ రాష్ట్రవ్యాప్త నిరసనలపై సీఎం స్పందించారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ 2014లో వంటగ్యాస్ రూ.410 ఉండేదని ప్రస్తుతం రూ.800కు పైగా పెరిగిందన్నారు. పెట్రోల్ రూ.72గా ఉండేదని ప్రస్తుతం రూ.104, డీజిల్ రూ.57 నుంచి రూ.92 పెరిగిందన్నారు. అప్పట్లో ముడిచమురు ధర కన్నా ఇప్పుడు తగ్గినా ధరలు పెంచారని అన్నారు. బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్నప్పుడు పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్‌ను తగ్గించి రాష్ట్ర ఖజానాపై భారం మోపారని అన్నారు. ప్రస్తుతం లీటరుకు రూ.3 పెంచామని ఆందోళన చేసే బీజేపీ దక్షిణాదిన ఇతర రాష్ట్రాల ధరలతో పరిశీలించాలన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు, గ్యారెంటీలు కల్పించే విషయంలో కట్టుబడి ఉన్నామని తెలిపారు.

ఇతర మతాలను గౌరవించండి

- బక్రీద్ ప్రార్థనల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య
- రాష్ట్రమంతటా ఘనంగా బక్రీద్ వేడుకలు



బక్రీద్ ప్రార్థనల్లో సీఎం సిద్దరామయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జమీర్ అహ్మద్



ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరూ అన్నదమ్ముల్లా జీవించాలని, ఇతర మతాలను గౌరవించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. బక్రీద్ సందర్భంగా సోమవారం చామరాజపేట ఈద్గా మైదానంలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ త్యాగం, బలిదానానికి ప్రతీక అయిన బక్రీద్‌ను జరుపుకుంటున్నవారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి జమీర్ అహ్మద్ ముఖ్యమంత్రికి టోపీ, శాలువాతో సత్కరించారు. అనంతరం ముస్లింలను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ సమాజానికి మంచి జరగాలని మీరు ప్రార్థనలు చేశారన్నారు. భాష, మతం, సమానత్వం కల్గిన మహత్తరమైన దేశంలో మనమంతా ఉన్నామన్నారు. రాజ్యాంగంపై నమ్మకం కల్గినవారు భేదాభిప్రాయాలు చూపరని అన్నారు. కాగా, రాష్ట్రమంతటా బక్రీద్ సంబరం జరిగింది. బెంగళూరులోని మైసూరు రోడ్డు, శివాజినగర్, కంటోన్మెంట్, బన్నేరుఘట్ట రోడ్డు, యలహంక, వైట్‌ఫీల్డ్‌తోపాటు పలు ప్రాంతాల్లోని ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు చేశారు. కొప్పళ్‌లో జరిగిన ప్రార్థనల వేళ ఎంపీ రాజశేఖరహిట్నాల్, ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ పాల్గొన్నారు. బెళగావిలో అంజుమన్ మైదానంలోనూ, శివమొగ్గ, విజయనగర, బీదర్, బాగల్కోటె, బెళగావి, మంగళూరు, ఉడుపి, మైసూరు, రామనగర, చిక్కబళ్లాపుర, కోలారు, ఉత్తర కన్నడతోపాటు అన్ని ప్రాంతాల్లోనూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. గొర్రెలను కుర్బానీ చేసి బంధుమిత్రులకు పంచిపెట్టారు.

రేపు మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ధర్నా

- అంగన్‌వాడీల సంఘం అధ్యక్షురాలు పద్మ

రాయచూరు, జూన్ 17 : ప్రభుత్వ బడుల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభిస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీఐటీయూ అనుబంధ కర్ణాటక అంగన్‌వాడీ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు హెచ్. పద్మ స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల 19న తాలూకా కేంద్రాల్లో ఎమ్మెల్యేల ఇళ్ల ముందు, జిల్లా స్థాయిల్లో మంత్రుల ఇళ్ల ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. గతంలో కలబుర్గిలో జరిగిన ఆందోళన సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభించాలని తాము చేసిన డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని గుర్తు చేశారు. అందుకు విరుద్ధంగా ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లోనే ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభిస్తామని ప్రకటించడం అంగన్‌వాడీలను సమూలంగా నాశనం చేయడమేనని ఆగ్రహం వ్యక్త చేశారు. పౌష్టికాహారలోపం నివారణ కోసం ఏళ్ల తరబడి శ్రమిస్తున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం అనేక పనులను అప్పగించినా వాటిని చిత్తశుద్ధితో నిర్వహించామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. అలాంటి అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాన్ని తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. ఇందుకోసం బుధవారం జరిగే ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్ల ముందు ధర్నాలో ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొనాలని పిలుపునిచ్చారు.



విలేకరులతో మాట్లాడుతున్న అంగన్‌వాడీల సంఘం అధ్యక్షురాలు పద్మ తదితరులు



పూర్తిగా నిండిన తుంగ జలాశయం

నిండిన తుంగ జలాశయం

కంప్లి, జూన్ 17 : ఈ యేడాది తుంగ జలాశయం కనివినీ ఎరుగని రీతిలో భారీ వర్షాల ప్రభావం వల్ల భర్తీ కావడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి తుంగభద్ర జలాశయానికి కూడా జూన్ నెలలోనే 4 వేల క్యూసెక్కులకు పైగా రావడంతో రైతన్నలు నారుమళ్లు చల్లుకోవడానికి సిద్ధమయ్యారు. తుంగ జలాశయం గరిష్ట నీటిమట్టం 588.24 మీటర్లుగా ఉంది. తుంగభద్ర జలాశయానికి 1765 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నదికి 1700 క్యూసెక్కులు నీరు వస్తోంది. గత యేడాది కన్నా ఈసారి తుంగభద్రకు త్వరలో భారీగా నీరు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. చిక్కమంగళూరు, కడూరు, శివమొగ్గ, ఆగుంబె అడవుల పైభాగంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర జలాశయం త్వరగానే నిండుతుందని ఆశిస్తున్నారు. జలాశయం కింద నాట్లు వేయడానికి రైతులు పొలాలను దుక్కులుదున్ని సిద్ధం చేసుకుంటున్నారు.

చింతామణిలో భారీ వర్షం

చింతామణి, జూన్ 17: చింతామణి పట్టణంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. జాతీయ రహదారి, ఎంజీ రోడ్డు సహా ఇతర మార్గాలలోని ఫుట్‌పాత్‌లపై నీరు నిలిచింది. ద్విచక్రవాహనదారులు ఇబ్బందులుపడ్డారు. వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు నగరసభ సిద్ధమైంది. నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి నేతృత్వంలో సోమవారం ఉదయం నుంచి పూడికతీతపనులు చేపట్టారు. సిబ్బంది కొన్ని చోట్ల పనులు చేస్తుండగా మరికొన్నిచోట్ల ఎక్స్‌కవేటర్ల సాయంతో చెత్తాచెదారం తొలగించారు. బాంబూ బజార్ నుంచి చేళూరు సర్కిల్ వరకు డబుల్ రోడ్డుకు ఇరువైపులా నీరు నిలిచిపోవడంతో తొలగింపు చర్యలు చేపట్టారు. నగరసభ కమిషనర్‌తో పాటు జూనియర్ ఆరోగ్య అధికారి విజయ్, జూనియర్ ఇంజనీర్ ప్రసాదరెడ్డి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ ఇన్‌చార్జ్ సీకే బాబు కార్యాచరణను పర్యవేక్షించారు. వర్షపు నీటి సమస్యలకు తాత్కాలిక నివారణకోసం హెల్ప్‌లైన్ నెంబరు 9108693721కు సంప్రదించాలని తెలిపారు.



వర్షపునీటిలో మునిగిన వాహనాలు

పరిశ్రమలకు భూముల కొరత

- భూములు ఇచ్చేందుకు అన్నదాతల వెనకడుగు
- ల్యాండ్‌బ్యాంక్ ఆశయానికి గండి
- రెట్టింపు పరిహారం కోసం డిమాండ్

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నా అందుకు అవసరమైనంత భూమి కొరత వెంటాడుతోంది. జిల్లాలవారిగా పరిశ్రమల ఏర్పాటుకు ల్యాండ్‌బ్యాంక్ సిద్ధం చేయాలన్న ప్రభుత్వ ఆశయానికి గండిపడుతోంది. రాష్ట్రంలో బెంగళూరు మినహాయించి బెళగావి, మైసూరు, ధారవాడ, మండ్య, రామనగర, హావేరి, తుమకూరు, కలబురగి, శిమొగ్గతోపాటు వివిధ నగర ప్రదేశాలకు 15-20 కిలోమీటర్ల దూరంలో కొత్తగా పారిశ్రామికవాడల ఏర్పాటుకు 10వేల ఎకరాల ల్యాండ్‌బ్యాంక్ సిద్ధం చేయాలని పారిశ్రామికవేత్తల నుంచి డిమాండ్ ఉంది. నగరాలు, సమీప ప్రాంతాల్లో లే అవుట్లు, సాగుకు అనుకూలమైన సారవంతమైన భూములు ఉన్నందున ల్యాండ్‌బ్యాంకుకు ఆశించిన స్థాయిలో భూమి లభించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో భూములు ఇచ్చేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. తరతరాలుగా ఇదే భూమిపై ఆధారపడ్డామని, ప్రత్యామ్నాయ జీవనం లేదని నిరాకరిస్తున్నట్టు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పెరిగిందని, అందుకు అనుగుణంగా పరిహారమిస్తే భూములు ఇస్తామని తెగేసి చెబుతున్నారు. రెండు దశాబ్దాల కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్‌కు అనుబంధంగా 220కు పైగా పారిశ్రామిక వాడలు ఏర్పాటయ్యాయి. ఇందులో 75కు పైగా చక్కెర ఫ్యాక్టరీలు, 4.56 లక్షల చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయి. వీటిలో జౌళి ఉత్పాదనా కేంద్రాలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో పారిశ్రామికవాడల స్థాపన కోసం వేలాది ఎకరాల భూమి సిద్ధంగా ఉంది. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు రోడ్డు రవాణా, రైళ్లు, విమానాలతోపాటు ఇతరత్రా రవాణా సౌలభ్యాలు లేవని అటువైపు పరిశ్రమల స్థాపనకు ముందుకు రావడం లేదు. బెళగావి, హుబ్బళ్లి, ధారవాడ, బెంగళూరు, మైసూరు, మండ్య, రామనగర, కలబురగి భాగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భారీగా డిమాండ్ ఉంది. ఈ నగరాలలో పరిశ్రమల ఏర్పాటుకు ఆశించినంత స్థాయిలో భూమి లభించడం లేదని కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలెప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ), కర్ణాటక స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ (కేఎస్ఐఐడీసీ) అధికారుల ద్వారా తెలుస్తోంది.

ప్రధాన సమస్యలు ఇవే..

రైతులు సాగుభూములను వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో రైతులు అత్యధికంగా పరిహారం కోరడం, రైతులు వ్యతిరేకించడంతో భూస్వాధీన ప్రక్రియకు అడ్డంకిగా మారడం, సాగునీరు ఆయకట్టులోనూ పరిశ్రమలు స్థాపించాలని ఆలోచించడం వంటివి కారణాలవుతున్నాయి. మరోవైపు కేఐఏడీబీ అధికారులు భూములను ఎంపిక చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమా..?

బెంగళూరు తర్వాత దేశ విదేశాలలో భారీస్థాయిలో ఆటోమొబైల్, స్పేర్ పార్ట్స్, విమానాల తయారీ విడిభాగాల పరిశ్రమలకు, బెళగావిలో కొత్త పారిశ్రామికవాడకు వెయ్యి ఎకరాల ల్యాండ్‌బ్యాంక్ అవసరం ఉంది. బెళగావిలో హైడ్రాలిక్స్ పరిశ్రమల విస్తరణకు వంద ఎకరాల భూమి, ఫౌండ్రీపార్కు నిర్మాణానికి 500 ఎకరాల భూమి కేటాయించాలని చిన్న, మధ్యతరహా పరిశ్రమల ముఖ్యులు ప్రభుత్వాన్ని కోరినా ప్రయోజనం చేకూరలేదు. 2011లో బెళగావిలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు రెండు వేల ఎకరాల ల్యాండ్‌బ్యాంకును సిద్ధం చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటివరకు ఆ స్థాయిలో భూమిని సేకరించలేదు. ఉత్పాదనారంగంలో బెళగావి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు పలు అవకాశాలు ఉన్నాయని పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారు. ముంబై - బెంగళూరు ప్రాంతానికి బెళగావి నుంచి రోడ్డు, రైల్వే, విమాన రవాణా సదుపాయాలు ఉన్నాయి. ప్రభుత్వం దశాబ్దాలుగా భూమిని సమకూర్చలేకపోవడంపై పారిశ్రామికవేత్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



బెళగావి జిల్లాలోని పారిశ్రామిక అభివృద్ధి సంస్థ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.97	1,580.74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	944	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,244	1.075
సామర్థ్యం (టీఎంసీలు)	6.07	4.84

స్టాక్ మార్కెట్ పేరుతో జిందాల్ అధికారికి రూ.17 లక్షల మోసం

బళ్లారి సిటీ, జూన్ 17: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి జిందాల్ కంపెనీకి చెందిన ఓ ఉన్నతాధికారిని మోసగించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయట పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆ అధికారి యూట్యూబ్ చూస్తుండగా స్టాక్ మార్కెట్ గురించి ఓ ప్రకటన వచ్చింది. దాన్ని క్లిక్ చేయగానే వాట్సాప్ గ్రూప్‌లోకి ప్రవేశించారు. అతను వారాల పాటు స్టాక్ మార్కెట్ గురించి సమాచారాన్ని తెలుసుకున్నారు. తరువాత డబ్బు పెట్టుబడి పెడితే అధికారి ఎక్కువ డివిడెండ్ ఇస్తామని అధికారిని నమ్మించారు. మోసగాళ్లను నమ్మి ఆ అధికారి మే 22నుంచి జూన్ 4వరకు దశలవారీగా రూ.17.05 లక్షలను వారు తెలిపిన ఖాతాలో వేశారు. మోసపోయానని గుర్తించిన అధికారి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీ సొత్తు స్వాధీనం

బళ్లారి సిటీ, జూన్ 17: వేర్వేరు కేసుల్లో చోరీకి గురైన ఆభరణాలు, చీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహిళల తాళిబొట్లు, చీరలతో పాటు మొత్తం 238గ్రాముల 6బంగారు గొలుసులను స్వాధీనం చేసుకుని ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు పోలీస్ సూపరెంటెండెంట్ రంజిత్ కుమార్ బండారు తెలిపారు. ఆదివారం సండూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ మాట్లాడుతూ బస్సులు, జాతర్లలో దొంగతనాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు తనతో పాటు అదనపు పోలీసు సూపరింటెండెంట్ రవికుమార్, నవీన్‌కుమార్, డీవైఎస్పీ ప్రసాద్ గోఖలే ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ, కురుగోడు సీపీఐ విశ్వనాథ్ హిరేగౌడ ఆధ్వర్యంలో పీఎస్ఐ వీరేశ్, డి.మాలశెట్టి, నాగరత్న, రేవణసిద్దప్ప, సిబ్బంది ఆలూరయ్య, రుద్రప్ప, వాసురప్ప, నసీర్, నాగేశ్‌రెడ్డి, విజయ్‌కుమార్, తిప్పేస్వామి బృందం సండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విచారణ చేపట్టారు. చోరనూరు పోలీస్ స్టేషన్‌లో 2, కుడుతిని పోలీస్‌స్టేషన్‌లో రూ.11,10లక్షల విలువైన 238 గ్రాముల బంగారాన్ని స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. విజయనగరం జిల్లా కరిగనూరు క్యాంపులో నివాసముంటున్న చెన్నప్ప, హనుమవ్వ అనే నిందితులు బెలూన్‌లు అమ్మేవారిగా గుర్తించారు. విచారణలో కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఐదు గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యుడు చిదానందరెడ్డి

కంప్లి, జూన్ 17 : తాలుకా పరిధిలోని బావిహళ్లి గ్రామంలో హళ్లికెర రామన్న అనే కాపరికి చెందిన ఐదు గొర్రెలు మృతి చెందాయి. విషపూరిత ఆహారం తిని మృతి చెందగా 18 గొర్రెలు అస్వస్థతకు గురయ్యారు. సోమవారం ఉదయం పశు వైద్యులు సంఘటనా స్థలానికి చేరుకుని వాటికి చికిత్స అందించారు. విషపూరిత ఆహారం తినడం వల్ల ఇలా జరిగిందని తెలిపారు. వర్షాలు వచ్చిన సమయంలో కొత్తగా చిగురు పుడుతుందని ఆ చిగురును గొర్రెలు, మేకలు తింటే అస్వస్థతకు గురై మృతి చెందే అవకాశం వుందని వారు తెలిపారు. గొర్రెల కాపరులు జాగ్రత్త వహించాలన్నారు. అలాంటి పొలాల్లో గొర్రెల మందను ఆపరాదని తెలిపారు.



బళ్లారిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



కంప్లిలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ శుభాకాంక్షలు



రాయచూరులో..

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బళ్లారి సిటీ,జూన్ 17: బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లాలో సోమవారం బక్రీద్ సందర్భంగా మసీదుల్లో ప్రార్థలను నిర్వహించారు. నగరంలోని బెంగళూరు రోడ్డు వైపు ఉన్న ఈద్గాలో, విజయనగరంలోని ఈద్గాలో ప్రార్థనలు చేశారు. పెద్ద ఎత్తున ముస్లింలు చేరకుని ప్రార్థనలు చేపట్టారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బళ్లారిలో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, ఈద్గామైదానంలో ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ నాజీర్ హుస్సేన్, బుడా అధ్యక్షులు జేఎస్. ఆంజనేయులు , ఏపీ ఎంసీ మార్కెట్ యార్డు అధ్యక్షులు కట్టిమని నాగేంద్ర తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు మించుశ్రీనివాస్, ముల్లంగి నందీశ్, ప్రభంజన్, ఆసీఫ్, హొసపేట్‌లో ఎమ్మెల్యే గవియప్ప ప్రార్థనల్లో పాల్గొన్నారు.

సిరుగుప్ప : తాలూకా వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం పెద్దలు, గురువులు ఈద్గా మైదానానికి చేరుకుని ఖురాన్ పఠించి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. డీఎస్పీ వెంకటేష్ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

కంప్లి : పట్టణంలో బక్రీద్‌ను ముస్లింలు శాంతియుతంగాను, సామూహికంగాను జరుపుకున్నారు. హొస్పేట రోడ్డులోని ఈద్గా మైదానంలో సామూహిక ఎమ్మెల్యే జేఎస్ గణేష్ పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

బళ్లారిరూరల్ : బళ్లారి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. మోకా, రూపనగుడి, అసొండి, కారేకల్, వీరాపురం, కుంటనహాళ్ పలు గ్రామాల్లో పండుగ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తోరణగల్లు : తాలుకా వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. మైదానాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రాయచూరు : త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే ఈద్-అల్-జుహా (బక్రీద్) వేడుకను ముస్లిం సోదరులు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని ఈద్గా మైదానం వద్ద వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సయ్యద్ యాసీన్, కాంగ్రెస్ నేత మహ్మద్ శాలం, అరుణ దోతరబండి, నగరసభ మాజీ సభ్యుడు కేఈ కుమార్ తదితరులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



సిరుగుప్పలో ప్రార్థనలకు వెళ్తున్న ముస్లింలు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



తోరణగల్లులో ప్రార్థనలు

స్థానికులకే అవకాశం ఇవ్వాలి

● పరిశ్రమలపై లారీ యజమానుల నిరసన ● భూములు, ఆదాయం కోల్పోయామని ఆగ్రహం



వేణివీరాపురం వద్ద నిరసనలో లారీ యజమానులు



నిలిచిపోయిన లారీలు

కంప్లి, జూన్ 17 : పరిశ్రమల్లో రవాణా చేసేందుకు స్థానిక లారీలకే అవకాశం ఇవ్వాలని యజమానులు డిమాండ్ చేశారు. సోమవారం నిరసనలో శారదా రోడ్డు లైన్స్ యాజమాన్యం సభ్యులు మహేష్ మాట్లాడుతూ కుడితిని, వేణివీరాపురం వద్ద కాన్, అగర్వాల్, ఓతూరు, రయానా స్పాంజ్ ఫ్యాక్టరీల్లో స్పాంజ్ రవాణా చేసేందుకు స్థానికులకు అవకాశం ఇవ్వాలన్నారు. ఈ నాలుగు ఫ్యాక్టరీల వల్ల దుమ్ముధూళి వల్ల ఎంతో మంది తమ వేణి వీరాపురం గ్రామంలో అనారోగ్యం పాలయ్యారన్నారు. కాస్తో కూస్తో పొలాలు ఫ్యాక్టరీలకు వెళ్లడంతో వచ్చిన డబ్బుతో దాదాపు వంద లారీలు కొనుగోలు చేసుకుని నడుపుతున్నామన్నారు. ఉన్నఫళంగా వేరే ప్రాంతం వారికి అవకాశం ఇవ్వడం తగదన్నారు. ఇప్పటికైనా నిర్ణయం మార్చుకోకపోతే జాతీయ రహదారి ముట్టడిస్తామన్నారు. ఐదు రోజులుగా రవాణా లేక ఇళ్ల ముందే లారీలు నిలుపుకున్నామన్నారు. నాలుగు ఫ్యాక్టరీల యాజమాన్యం తమ కష్టాలను దృష్టిలో వుంచుకుని తమకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడ్తామన్నారు. నిరసనలో నగేష్, ఆనంద్, స్వామి, దేవన్న, తిప్పయ్య, శివప్ప, దేవరాజు, జగపతి బాబు, సంజీవప్ప, తిప్పయ్య, క్రిష్ణమూర్తిదేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు రూ.1.50 కోట్లు

కంప్లి, జూన్ 17: విజయనగర జిల్లా హగరి బొమ్మనల్లి తాలుకా మేల్కాద్రి గ్రామంలో వెలసిన కల్లేశ్వర దేవస్థానం అభివృద్ధికి రూ. 1.50 కోట్లు ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా మంజూరు చేసినట్లు డైరెక్టర్ సతీష్ శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. పురాతన కాలం నాటి ఆలయం ఇది జీర్ణోద్ధారణ కోసం పునర్నిర్మాణం కోసం తమ ధర్మస్థల గ్రామీణాభివృద్ధి పథకం ఇలాంటి పురాతన ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్న వాటిని దృష్టిలో వుంచుకుని, భారతదేశ సాంప్రదాయాలు దృష్టిలో వుంచుకుని ఆలయ పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశామ న్నారు. గ్రామం, తాలుకా ప్రజలు ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరం. ఆలయం పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.



కల్లేశ్వరస్వామి దేవస్థానం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రాయచూరు, జూన్ 17 : జిల్లాలోని మస్కి తాలూకా అంకుశదొడ్డి గ్రామ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ పై వెళుతున్న వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. లింగసుగూరు నుంచి మస్కి వైపు వస్తున్న గుడిహాళ గ్రామ నివాసి యమునప్ప(40) మరో వ్యక్తి గంగణ్ణలు రోడ్డులో చెడిపోయి ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ క్రమంలో యమునప్ప అక్కడికక్కడే మృతి చెందగా గంగణ్ణకు తీవ్ర గాయాలైయ్యాయి. క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మస్కి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



యమునప్ప(ఫైల్)

సేవ్ సండూరు..!



● అటవీ ప్రాంతాన్ని కాపాడండి
● సామాజిక మాధ్యమాల్లో ఉద్యమం..

బళ్లారి, జూన్ 17(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలోని సండూరు స్వామిమలై ఆటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు 'సేవ్ సండూరు' పేరుతో సామాజిక ఉద్యమం మొదలయ్యింది. సండూరు ప్రాంతంలో ఉన్న ఇనుప గనులను తవ్వుకునేందుకు కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ఇటీవల అనుమతించారు. వీటిపై పత్రికలు, టీవీ చానల్లో వచ్చిన కథనాలపై సామాజిక కార్యకర్తలు కదిలారు. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల వేదికగా సేవ్ సండూర్‌ను ప్రారంభించారు.సండూరు స్వామిమలైన ప్రాంతంలో కుదురేముఖ్ సంస్థకు 485.77హెక్టార్ల మైనింగ్ విస్తీర్ణాన్ని లీజ్‌కు అనుమతించింది. అయితే ఈ ప్రాంతంలో దట్టమైన అడవితో పాటు అతిపురాతమైన, చారిత్రాత్మక కుమారస్వామి ఆలయం నెలకొని ఉంది. ఇక్కడ మైనింగ్ తవ్వకాలు జరిగితే భూమి తన నైసర్గిక స్వభావాన్ని కోల్పోవడంతో పాటు నీటి వనరుల పారుదలకు ఆటంకం ఏర్పడుతుంది. దీని ఫలితంగా అడవి ప్రాంతంలో ఉన్న వన్య మృగాల జీవనానికి ఆటంకం కలగడంతో పాటు ప్రజాఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని అని ఆటవీశాఖ అధికారులు గతంలోనే నివేదిక ఇచ్చారు. అయినా తవ్వకాలు అనుమతివ్వడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. మందుగా సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేకత వెల్లడికావడం విశేషం.



సండూరు ఆటవీ ప్రాంతం

అనవసర తనిఖీలకు చెక్: ఎస్పీ



ఎస్పీ శ్రీహరిబాబు

బళ్లారి సిటీ, జూన్ 17: ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం హంపిలో అడుగడుగునా తనిఖీల పేరుతో విసిగించేది లేదని, ఎస్పీ శ్రీహరిబాబు పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన హంపి స్మారక చిహ్నాల అందాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులు పోలీసుల తనిఖీల్లో చికాకు తెప్పించే ఉద్దేశం లేదన్నారు. భద్రత దృష్ట్యా మాత్రమే తనిఖీలు చేపడ్తామన్నారు. ఇక నుంచి కడ్డిరాంపురం క్రాస్, కమలాపురంలో మాత్రమే పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. స్మారక చిహ్నాలను చూసి, ఆనందానికి భంగం కలగకుండా బయట మాత్రమే వాహనాన్ని తనిఖీ చేస్తామన్నారు.



విద్యుత్ కాంతుల్లో హంపిలోని కడ్లెకాళు గణపతి ఆలయం

ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాల అలంకరణ

బళ్లారి సిటీ, జూన్ 17: హంపిలోని కడ్లెకాళు గణపతి ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విద్యుత్ కాంతుల్లో రాతి స్తంభాలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. వరుస సెలవుల కారణంగా హంపిలో పర్యాటకులు పోటెత్తారు.

రోగులతో మర్యాదగా మసలుకోండి

● వైద్యులకు విమ్స్ డైరెక్టర్ గంగాధర్ సూచన



మాట్లాడుతున్న గంగాధర్‌గౌడ

బళ్లారి సిటీ, జూన్ 17: విమ్స్‌తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం కోసం వచ్చే రోగులకు తగిన వైద్యం అందించాలని, సంరక్షకులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని విజయనగర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్ టి.గంగాధర్ గౌడ సూచించారు. సోమవారం బళ్లారి జిల్లా విమ్స్ అడ్మినిస్టేషన్ భవనంలోని ఆడిటోరియంలో వైద్య విద్యాశాఖ,ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులను వేధించడం తగదని, నిరక్షరాస్యులు ఆస్పత్రికి వచ్చినప్పుడు వారికి తగిన సహాయం అందించాలన్నారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో రెండు ప్రభుత్వ ఆసుత్రులు ఉన్నాయని, గర్భిణులు ఆశా కార్యకర్తల సాయం పొందాలన్నారు. బాల్యవివాహాల నష్టాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈసందర్భంగా ఆయుష్మాన్‌భారత్, రక్తపోటు, మధుమేహం చికిత్స, క్షయ, మలేరియా, డెంగీ నివారణ , మానసిక వ్యాదుల నిర్వహణ,ఆరోగ్య విద్యపై చర్చించారు. విమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మంజునాథ్, డా.బసవరాజు, డాక్టర్ విశ్వనాథ్, చంద్రశేఖర్, ప్రొగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అబ్దుల్లా, డా.మరియంబి, టీబీ శానిటోరియం డాక్టర్ పాండురంగ, డా.గౌతమ్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, అరుణ్‌కుమార్, గోపాల్, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

దివాలా సర్కార్ చేసేది దోపిడీనే..!

● పెట్రోల్ ధరల పెంపుపై బీజేపీ నిరసన



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాయచూరు, జూన్ 17 : ఐదు గ్యారెంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను దివాలా తీయించిందని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.శంక్రప్ప ఆరోపించారు. దివాళ తీసిన సర్కారు తన మనుగడ కోసం ప్రజల దోపిడీకి సిద్ధపడిందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరశిస్తు బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఖాళీ చిప్పలను ప్రదర్శిస్తు వినూత్న రీతిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన శంక్రప్ప, గతంలో పెట్రోల్, డీజిల్ ధర పెంచిన మోదీకి సిగ్గులేదా అంటు నిలదీసిన కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇప్పుడేం సమాధానం చెబుతారని నిలదీశారు. అత్యంత సీనియర్ 8 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఘనత ఉంది సిద్ధరామయ్యకు అని చెప్పే కాంగ్రెస్ నాయకులు అయన ప్రజల దోపిడీ చేసేందుకేనా సమర్థత అంతెద్దేవా చేశారు. వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తుందన్నారు.



ఖాళీ చిప్పలతో నిరసన తెలుపుతున్న బీజేపీ మహిళా నేతలు

హోసూరు జోన్

నేడు విద్యుత్ కోత

హోసూరు, జూన్ 17: హోసూరు డివిజన్‌లోని బాగలూరు, నారిగానపురం సబ్ స్టేషన్లలో నిర్వహణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొననుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాగలూరు, జీమంగలం, ఉళియాళం, నల్లూరు, బెలత్తూరు, దిన్నపల్లి, సూడాపురం, అలసపల్లి, బి.ముఉగానపల్లి, దేవీరపల్లి, సత్యమంగళం, తుమ్మనపల్లి, బడదేపల్లి, పలవనపల్లి, ముత్తాళి, ముదుగురికి, వనమంగళం, కొత్తపల్లి, బేరికై, అత్తిముగం, ఎ.చెట్టిపల్లి, నరసపల్లి, పన్నపల్లి, సిక్కనపల్లి, నెరిగం, కులగెజాలన్ దొడ్డి, తన్నీర్‌గుండ్లపల్లి, ఎలువపల్లి, కె.ఎన్.దొడ్డి, బి.ఎస్.తిమ్మసంద్రం ప్రాంతాల్లో విద్యుత్ కోత ఏర్పడనుందని విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

కారును ఢీ కొన్న లారీ.. మహిళ మృతి

హోసూరు (క్రైం), జూన్ 17: హోసూరు సమీపాన కారును లారీ ఢీకొన్న ఘటనలో బెంగళూరుకు చెందిన ఒక మహిళ మృతి చెందింది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు జిల్లా హెబ్బాళ్ ఆర్‌టి నగర్ సమీపంలోని గుడ్డహళ్లికి చెందిన కోదండరామన్ అతని భార్య విజయలక్ష్మి(61) ఈనెల 14వ తేదీ రాత్రి బెంగళూరు - కృష్ణగిరి జాతీయ రహదారి సానమావు అటవీప్రాంతం వైపు కారులో కుటుంబ సమేతంగా వస్తుండగా ఆ సమయంలో అటుగా వెళ్తున్న లారీ మరో లారీని ఢీ కొంది. ప్రమాదానికి గురైన లారీని ఢీ కొన్న కారులో ఉన్న విజయలక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కారు నడుపుతున్న ఆమె కుమారుడు శ్రీనాథ్ (43), బంధువు మునియప్ప (64) లకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుప్రక్కల వారు వారిని రక్షించి చికిత్స నిమిత్తం హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న హడ్కో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించి తదుపరి దర్యాప్తు చేపట్టారు.

పెరిగిన టమోటా ధరలు

● అధిక లాభాలతో రైతుల్లో హర్షం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న టమోటాలు

హోసూరు జూన్ 17 : నిన్న, మొన్నటి వరకు ధరలు లేక డీలా పడిన టమోటా రైతులు పెరిగిన ధరలతో ఇప్పుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా హోసూరు మార్కెట్లో టమోటా ధరలు భారీగా పలుకుతున్నాయి. బహిరంగ మార్కెట్లో టమోటా కిలో రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. ఇక మార్కెట్లో రైతులకు మంచి ధర పలుకుతోంది. 15 కిలోల ట్రే రూ.700 నుంచి రూ.1000 వరకు అమ్ముడుబోతోంది. హోసూరు జిల్లాలోని ఎంకనీకోట, కెలమంగలం, తళి, ప్రాంతాల్లో టమోటా అధికంగా సాగు చేస్తున్నారు. జిల్లాలో 5వేల ఎకరాల్లో పైగా టమోటా సాగు చేస్తున్నారు. వారం కింద రూ.10 ఉన్న టమోటా ఏకంగా రూ.80కి చేరింది.



టమోటకు వ్యాధి సోకడమే కారణమని తెలుస్తోంది. దీని ప్రభావంతో మార్కెట్‌కు పంట రావడం తగ్గిపోయింది. హోసూరు మార్కెట్‌కు రోజూ 8 టన్నుల వరకు టమోటాలు వచ్చేవి. ప్రస్తుతం ఎండలు, రోగాలు సోకడంతో సరఫరా తగ్గి ఇప్పుడు ధరలు అధికమయ్యాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. అరకొర పంట పండిన రైతులు మాత్రం అధిక లాభాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సింధనూరు చెరువుకు రేపు నీటి విడుదల: ఎమ్మెల్యే

రాయచూరు, జూన్ 17 : జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం తుంగభద్ర రిజర్వాయర్ నుంచి ఎడమకాలువ ద్వారా ఇప్పటికే నీరు విడుదల చేశారు. ఈ నెల 19న సింధనూరు చెరువుకు నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ తెలిపారు. సోమవారం సింధనూరు నగరసభ అధికారులకు లేఖ రాసిన ఎమ్మెల్యే, ఇప్పటికే కాల్వలో నీటి ప్రవాహం మొదలైందని కేవలం 10 రోజులు మాత్రమే నీటి ప్రవాహం ఉంటుందని ఆలోగా సింధనూరు చెరువుతో పాటు తాలూకాలోని తాగునీటి అవసరాలున్న అన్ని చెరువులకు నీటిని విడుదల చేయాలని సూచించారు. సాగు, తాగునీటికి నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీపీఎం కార్యాలయం ధ్వంసంపై నిరసన

హోసూరు, జూన్ 17: తిరునల్వేలిలో సీపీఎం కార్యాలయం ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ హోసూరులోని రాంనగర్ అన్నా విగ్రహం దగ్గర సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన జరిగింది. సీపీఎం కార్యాలయంపై దాడి చేసిన సంఘ విద్రోహశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కులాంతర వివాహాలు చేసుకున్నవారికి రక్షణ కల్పించాలని కోరారు. నిరసనలో సీపీఎం హోసూరు నగర కార్యదర్శి జయరామన్ అధ్యక్షత వహించారు. నిరసనలో డి.కె.వనవేందన్, సీపీఎం శ్రీధర్, ఎంజెలా మేరీ, జయరామన్, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.




హోసూరు రాంనగర్ అన్నా విగ్రహం వద్ద నిరసనలో సీపీఎం నాయకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

వేదం వేంకటరాయశాస్త్రి (వర్ధంతి)



వేదం వేంకటరాయశాస్త్రి సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు, నాటక కర్త 1853 డిసెంబరు 21న చెన్నైలో జన్మించారు. మద్రాస్ క్రైస్తవ కళాశాలల సంస్కృత పండిత పదవిని 25 సంవత్సరాలు సమర్థవంతంగా నిర్వహించారు. గ్రాంధిక భాషావాది అయిన ఆయన సాహిత్య ప్రక్రియలో వ్యవహారిక భాషా ప్రయోగాన్ని విమర్శించారు. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ప్రతాప రుద్రీయం, ఉషా నాటకం వంటివి ఎంతో పేరొందాయి. మహోపాధ్యాయ బిరుదు, విద్యాదాన వ్రత మహోదధి, సర్వతంత్ర స్వతంత్ర సత్కారాలు, ఆంధ్ర విశ్వకళా పరిషత్ ఆధ్వర్యంలో కళాప్రపూర్ణ గౌరవం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. 1929 జూన్ 18న కన్నుమూశారు.

కేఎస్ సుదర్శన్ (జయంతి)



కుప్పహళ్లి సీతారామయ్య సుదర్శన్ 1931 జూన్ 18న చత్తీస్‌ఘర్ రాష్ట్రంలో రాయ్‌పూర్‌లో జన్మించారు. వీరి తల్లి దండ్రులది మండ్య జిల్లా కుప్పహళ్లి గ్రామం. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)కు చీఫ్‌గా అంటే ఐదో సర్ సంఘ్ చాలక్‌గా వ్యవహరించారు. 2000-2009 వరకు కొనసాగారు. బాల్యం నుంచే ఆర్ఎస్ఎస్‌లో క్రియాశీలకంగా ఉంటూ ప్రచారక్, తదితర ఉన్నత హోదాకు ఎదిగారు. జబల్ పూర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి టెలీ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ పట్టా అందుకున్నారు. సమాజానికి ఆయన చేసిన నిస్వార్థసేవకు మీరట్‌లోని శోభిత్ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 2012 సెప్టెంబరు 15న కన్నుమూశారు.

ఎప్పటిలాగే.. ఆలస్యంగా..!

నేడు ఇంటర్ మినిస్టీరియల్ బృందం

అనంతపురం అర్బన్, జూన్ 17: పంట నష్టం జరిగి.. సీజన్ మారిత తరువాత కేంద్ర బృందం వస్తోంది. ఎప్పటిలాగే పాడైపోయిన పంటలు క్షేత్రస్థాయిలో లేని సమయంలో 'పరిశీలన'కు వస్తోంది. ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్న కేంద్ర బృందానికి జిల్లాలో పంట నష్టం వివరాలను తెలియజేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం మంగళవారం సాయంత్రం జిల్లాకు చేరుకుంటుంది. ఒకటో బృందానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రితీష్ చౌహాన్ నేతృత్వం వహిస్తారు. ఇందులో సభ్యులుగా పొన్నుస్వామి, సునీల్ దూమే ఉన్నారు. రెండో బృందానికి ఖర్చుల విభాగం డైరెక్టర్ చిన్మయ్ గోట్‌మరే నేతృత్వం వహిస్తారు. ఈ బృందంలో సభ్యులుగా అశీష్‌పాండే, వినోద్‌కుమార్ ఉన్నారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో రెండు బృందాల సభ్యులు ఈ నెల 19న సమావేశమౌతారు. ముందుగా 2023-24 రబీ సీజన్ పంటనష్టాన్ని తెలియజేసే ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. సమావేశం ముగిసిన తర్వాత రెండో బృందం సభ్యులు కర్నూలు జిల్లాకు వెళతారు. ఒకటో బృందం సభ్యులు శ్రీసత్యసాయి జిల్లాలోని రొద్దం మండలంలో క్షేత్ర స్థాయి పర్యటనకు వెళతారు. పర్యటన ముగించుకొని రాత్రికి అనంతపురం నగరానికి చేరుకుంటారు. ఈ నెల 20న పప్పుశనగ సాగు చేసిన విడపనకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్లు మండలాల్లో పర్యటిస్తారు. స్థానిక రైతులతో మాట్లాడి, పంటనష్టం వివరాలు తెలుసుకుంటారు.

ముందే రావాల్సింది..

గత ఏడాది రబీ సీజన్ ముగిసి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. రబీలో దెబ్బతిన్న పంటల ఆనవాళ్లు క్షేత్రస్థాయిలో ఇప్పుడు కనిపించవు. పంటలు దెబ్బతిన్న సమయంలో కేంద్ర బృందాన్ని జిల్లాకు పంపించి ఉంటే వాస్తవ పరిస్థితులు వారికి కనిపించేవి. రబీ సీజన్ మార్చి నెలాఖరుతో ముగిసింది. రెండున్నర మాసాల తర్వాత కరువు బృందాన్ని పంపితే క్షేత్ర స్థాయిలో వారు దేన్ని పరిశీలిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. నష్టం జరిగిన ప్రతిసారీ ఇదే తంతు జరుగుతోంది. దెబ్బతిన్న పంటలను చూపించలేని పరిస్థితులలో ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది.

కరువు మండలాలు 14..

గత ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. రబీ సీజన్‌లోనూ పంటలను తీవ్రంగా నష్టపోయారు. రబీలో పప్పుశనగతోపాటు ఇతర రకాల పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 14 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. ఇందులో బెళుగుప్ప, బొమ్మనహాళ, డి.హీరేహాళ్, గుత్తి, గుంతకల్లు, కణేకల్లు, పెద్దపప్పూరు, పుట్లూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, యల్లనూరు మండలాలు ఉన్నాయి.

సెజ్ భూముల్లో సేద్యం

మడకశిర రూరల్, జూన్ 17: మండలంలో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు సేకరించిన భూముల్లో రైతులు సేద్యం పనులకు శ్రీకారం చుట్టారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ఆధ్వర్యంలో రైతులు సోమవారం సెజ్ భూముల్లో సేద్యం పనులు మొదలెట్టారు. అనంతరం సీ కొడిగేపల్లిలో జంగాలపల్లి పెద్దన్న మాట్లాడారు. పరిశ్రమలు స్థాపిస్తామని చెప్పి 2006లో వైఎస్ హయాంలో మండలంలోని సీ కోడిగేపల్లి, నల్లానయణపల్లి, కేతేపల్లి, కల్లుమర్రి, అగ్రంపల్లి తదితర గ్రామాల పరిధిలో 660 మంది రైతుల నుంచి 2200 ఎకరాల భూములను కారు చౌకగా తీసుకున్నారన్నారు. పరిశ్రమలు స్థాపించి, భూములిచ్చిన రైతు కుంటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇస్తామని నమ్మబలికారు. భూములు తీసుకుని 17 ఏళ్లయినా నేటికీ ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో భూములిచ్చిన రైతులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు సేకరించిన ఐదేళ్లలోపు పరిశ్రమలు ఏర్పాటు చేయలేకపోతే వాటిని రైతులకు తిరిగి ఇవ్వాల్సి ఉందన్నారు. ఆ మేరకు రైతులు.. తమ భూముల్లో పంటలు వేసుకుంటున్నారని ఆయన వివరించారు.

117 జీఓను రద్దు చేయాలి

ధర్మవరం, జూన్ 17: జీఓ నంబర్ 117ను పూర్తిగా రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అలాగే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా 12వ పీఆర్సీని తక్షణం అమలు చేయాలని, ఉపాధ్యాయ నియామకాలలో అప్రెంటీస్ విధానాన్ని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, రాష్ట్ర విద్యా వ్యవస్థలో ఒకే సిలబస్ అమలు చేయాలని విన్నవించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బాగేపల్లి, జూన్ 17: భక్తి, త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ (ఈద్-ఉల్-అదా)ను పట్టణం సహా గ్రామాల్లోనూ ముస్లింలు ఉత్సాహంగా ఆచరించారు. పట్టణ శివారులోని ఈద్గామైదానంలో సోమవారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని జామియా, ఫారూఖ్, కమర్, నూరాని, కొత్తపల్లి రోడ్డులోని మసీదు సహా 18 మసీదుల నుంచి ముస్లింలు పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా అల్లాను స్మరిస్తూ ఈద్గా మైదానానికి చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు ఏర్పాటైన విశేషప్రార్థనల్లో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తాలూకాలోని పాతపాళ్య, మార్గానుకుంటె, గూళూరు, బిళ్ళూరు, నారేమద్దేపల్లి, మిట్టేమరి, జూలపాళ్య, దిగవన కుంటపల్లి, యుగవనకుంటపల్లి, దేవుకుంటె సహా పలు గ్రామాలలోని ముస్లింలు ఊరేగింపుగా సాగి స్థానిక ఈద్గా మైదానాలకు చేరుకున్నారు. బక్రీద్ పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పరస్పరం ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఫారూక్ మసీదు ధర్మగురు హజరత్ మౌలానా రియాజుద్దీన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి బక్రీద్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం పట్టణ శివారులోని ఖబరస్తాన్‌కు చేరుకుని పూర్వీకుల సమాధుల ముందు ప్రార్థన చేశారు.

ప్రశాంతంగా ప్రార్థనలు

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో రంజాన్, బక్రీద్, ఈద్‌మిలాద్ తదితర ముస్లిం పండుగల వేళ ప్రతిసారి శిడ్లఘట్ట డీవియేషన్‌రోడ్డులోని ఈద్గా మైదానం సమీపానగల ప్రముఖకూడలిపైనే ప్రార్థనలు నిర్వహించడం ట్రాఫిక్‌కు పెనుసవాల్‌గా మారింది. చిక్కబళ్ళాపుర నుంచి కోలారుకు వెళ్లే మార్గం కావడంతో సోమవారం కూడా కూడా ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొని ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారు. సుమారు మూడు నాలుగు గంటలపాటు ట్రాఫిక్‌ను మళ్లించాల్సి వచ్చింది. సుమారు 15ఏళ్లక్రితమే ముస్లింలకోసం దేవనహళ్లి రోడ్డు మార్గంలో ఆరు ఎకరాల స్థలాన్ని కేటాయించాలనే అంశం ప్రతిపాదనకు వచ్చింది. ప్రతిసారి పండుగల వేళ ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా జంగ్లిపీర్‌బాబా మసీదు సమీపాన 6 ఎకరాల స్థలంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి పలుమార్లు వినతులు సమర్పించినా ప్రయోజనం లేకపోయింది. దీనిపై బెంగళూరు గ్రామీణ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కెహెచ్ మునియప్ప స్పందిస్తూ వచ్చే ఏడాది నాటికి జంగ్లిపీర్ దర్గా వద్ద సామూహిక ప్రార్థనలకు అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కేపీసీసీ కార్యదర్శి వి మంజునాథ్ మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలోని మసీదులు, దర్గాల అభివృద్ధికి రూ.2కోట్ల గ్రాంటు వచ్చిందని సద్వినియోగం చేస్తామన్నారు. బక్రీద్‌ప్రార్థనలు ప్రశాంతంగా కొనసాగేలా పోలీసు బందోబస్తు నిర్వహించారు.



చేళూరులో ఊరేగింపుగా...



రోడ్డుపైనే ప్రార్థనల్లో ముస్లింలు

వర్షం ప్రభావంతో మసీదులకే పరిమితం

చింతామణి: చింతామణి పట్టణం, తాలూకా వ్యాప్తంగా బక్రీద్ పండుగ సంబరంగా సాగింది. వర్షం ప్రభావంతో మైదానాలు చిత్తడిగా మారడంతో తాలూకాలోని వివిధ ఈద్గా మైదానాలకు బదులు చాలా వరకు మసీదులకే ప్రార్థనలు పరిమితమయ్యాయి. సాధారణంగా ఏట పట్టణంలోని దొడ్డపేటలోని జామియా మసీదులో చేరే ముస్లింలు అనంతరం పట్టణ శివారులోని బాగేపల్లిరోడ్డులోని ఈద్గా మైదానానికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసేవారు. అయితే ఆదివారం కురిసిన వర్షం ప్రభావంతో చాలాచోట్ల తేమ ఉండడంతో ఈద్గా మైదానాలలో ప్రార్థనలకు ఇబ్బందిగా మారింది. మసీదులకే పరిమితమై ప్రార్థనలు కొనసాగాయి. మసీదు ధర్మగురువులు బక్రీద్ పండుగ ప్రాధాన్యతను వివరించారు. పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. జామియా మసీదు సమితి అధ్యక్షుడు గౌస్‌పాషా, కార్యదర్శి ఇనాయతుల్లా షరీఫ్, ఉపాధ్యక్షుడు సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.



చింతామణి జామియా మసీదులో ప్రార్థనలు



బాగేపల్లి ఈద్గా మైదానంలో విశేష ప్రార్థనల్లో ముస్లింలు

బీజేపీ - జేడీఎస్ మైత్రి మరింత పటిష్టం

» పొత్తు తొలి ప్రయోగం విజయవంతం

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో తాలూకాస్థాయి నుంచి శాసనసభ దాకా అనుకూలంగా మద్దతు ఇచ్చుకునే సంప్రదాయం కొనసాగుతోంది. జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లు రాష్ట్రంలో దశాబ్దాల అనుభవం కల్గిన ప్రాంతీయ పార్టీ జేడీఎస్‌తో చేతులు కలిపి ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే తొలిసారిగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకునే ప్రయోగం రెండు పార్టీలకు విజయవంతం చేకూర్చింది. ఒంటరిగా ఎవరికి వారు పోటీ చేసి ఉంటే ఇటువంటి ఫలితాలు సాధ్యం కావని రాజకీయ విశ్లేషకులతోపాటు బీజేపీ, జేడీఎస్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. 28 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ 17, జేడీఎస్ 2 చోట్ల గెలుపు సాధించింది. కేంద్రంలో రాష్ట్ర వాటాగా 4 మంత్రి పదవులు దక్కాయి. జేడీఎస్ నుంచి గెలుపొందిన కుమారస్వామి కీలకమైన భారీ పరిశ్రమలశాఖ మంత్రి అయ్యారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ 20 స్థానాల్లో గెలుపు సాధిస్తామని ధీమాలో ఉన్నా 9కే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 135, బీజేపీకి 66, జేడీఎస్ 19 స్థానాలు దక్కాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 17, జేడీఎస్ 2, కాంగ్రెస్ 9 సీట్లు వచ్చాయి. ఇలా తొలి మైత్రి ప్రయోగంతో రెండు పార్టీలు బలోపేతం అయ్యాయి. ఇదే మైత్రి భవిష్యత్తులోనూ కొనసాగించాలని బీజేపీ అగ్రనేత యడియూరప్ప, జేడీఎస్ నేత కుమారస్వామిలు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 3 ఎమ్మెల్యే స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. త్వరలోనే బీబీఎంపీతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇకపై జరిగే అన్ని ఎన్నికల్లోనూ కలిసే ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్టు సమాచారం.

శిడ్లఘట్టకు నిధులు కేటాయించండి

శిడ్లఘట్ట, జూన్ 17: కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామిని శిడ్లఘట్ట నియోజకవర్గ బీజేపీ నాయకులు బెంగళూరులో సోమవారం కలసి ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ పట్టణంలో మాట్లాడుతూ శిడ్లఘట్ట నియోజకవర్గ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కోరామన్నారు. వెనుకబడిన ప్రాంతమైన శిడ్లఘట్ట నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని కోరామన్నారు. చింతామణి తాలూకా మస్తేనహళ్ళి సమీపాన పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే భూస్వాధీన ప్రక్రియ జరిగిందని అయితే శిడ్లఘట్టలో ఎలాంటి పరిశ్రమలు లేవని ఇక్కడకూడా ఏదైనా పరిశ్రమ కల్పించడం ద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుందన్నారు. సరిహద్దు తాలూకా కావడంతో ప్రత్యేకంగా పరిగణించి వసతి పథకం కింద ఎక్కువ ఇళ్లు మంజూరు చేసి పేద, మధ్యతరగతి వర్గాలకు అనుకూలం చేయాలని కోరామన్నారు. ప్రధానంగా శాశ్వత నీరావరి యోజన కల్పించేందుకు చొరవ చూపాలని కోరామన్నారు. ఈ సందర్భంగా కోలారు ఎంపీ మల్లేశ్‌బాబు, ఇతర ఎమ్మెల్యేలు కేంద్రమంత్రిని కలిశారన్నారు.



కేంద్రమంత్రితో నాయకుల భేటీ

అన్నమయ్య సంకీర్తనలతో అలరించిన చిన్నారులు



ప్రశంసా పత్రాలతో చిన్నారుల బృందం

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి సంగీతాలయం ఏర్పాటు చేసిన అన్నమయ్య పదార్చన కార్యక్రమంలో భాగంగా చిన్నారులు సంకీర్తనలతో అలరించారు. పద్మావతి కళానికేతన్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టీటీడీ హిందూధర్మప్రచార పరిషత్ నిర్వాహకులు భుజరంగరావు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు శతాబ్దాలనుంచి నేటికీ ఆదరణ పొందుతున్నాయన్నారు. ఆధునిక యుగంలోనూ చిన్నారులు సంకీర్తనలు నేర్చుకునేందుకు ముందుకు రావడం, అందుకు పలు సంస్థలు లాభాపేక్ష లేకుండా నిరంతరం శ్రమించడం సంతోషకరమన్నారు. గౌరవఅతిథిగా పద్మావతి కళానికేతన్ గౌరవ కార్యదర్శి జీవీ వేణుగోపాల్ పాల్గొన్నారు. లాస్య ఎడెరా కూచిపూడి నృత్యం అలరించింది. వాగ్దేవి సంగీతాలయ ముఖ్యులు నీలిమా నాగవేణి పర్యవేక్షణలో పదార్చన, కూచిపూడి నృత్యం సాగింది.

సేవాభావం పెరగాలి

దొమ్మసంద్ర, జూన్ 17: నానుంచే అంతా అనే భావన వీడి కష్టంలో ఉన్న వారిని ఆదుకునే సేవాభావం పెరగాలని టౌన్ ఆసుపత్రి ముఖ్యుడు డాక్టర్ పరమేశ్ అభిప్రాయపడ్డారు. సర్జాపుర గ్రామంలోని టౌన్ ఆసుపత్రి ఆవరణలో సర్జాపుర లయన్స్‌క్లబ్, టౌన్ ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత మధుమేహ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో మధుమేహం సమస్య అధికమవుతోందన్నారు. సరమైన ఆహార పద్ధతులు, వ్యాయామం, యోగా వంటివి పాటించడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చునన్నారు. సర్జాపుర ప్రాంతంలో ప్రజలకు ఉత్తమమైన ఆరోగ్యసేవను అందించే ఉద్దేశ్యంతో తమ ఆసుపత్రిలో లాభాలలో కొంతమొత్తాన్ని సమాజసేవకు కేటాయిస్తున్నట్టు తెలిపారు. శిబిరంలో 200మందికిపైగా మధుమేహం, కంటి సమస్యలను పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఔషధాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాధికాదేవి, సర్జాపుర గ్రామపంచాయతీ సభ్యులు కిటికి శ్రీనివాస్, ప్రముఖులు జి నాగరాజు, అశ్వథ్ ఆచారి, లయన్ మహేశ్, తిండ్లు శ్రీనివాసయ్య, మోక్షలక్ష్మి, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



శిబిరం ప్రారంభంలో ప్రముఖులు

పెట్రో ధరల పెంపుపై బీజేపీ నిరసన

బంగారపేట, జూన్ 17: పెట్రోల్, డీజిల్ ధరల పెంపును ఖండిస్తూ బీజేపీ పిలుపునిచ్చిన నిరసనకు మద్దతుగా సోమవారం ధర్నా చేపట్టారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ మహేశ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్రప్రభుత్వం ప్రజల జేబులకు చిల్లు పెట్టేలా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల అమలుకు వేలకోట్లు ఖర్చు చేస్తూ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా బీజేపీ తాలూకా అధ్యక్షుడు సంపంగిరెడ్డి, నాగేశ్, మంజునాథ, పురసభ సభ్యుడు బీపీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్ తదితరులు

ఎంతోమంది ప్రాణత్యాగ ఫలమే కార్గిల్ యుద్ధ విజయం

● కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 17: ఎంతోమంది ప్రాణత్యాగ ఫలితమే కార్గిల్ యుద్ధ విజయమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్-2024 ఉత్సవాల్లో భాగంగా ఇండియన్ ఆర్మీ ఆర్టిలరీ విభాగం డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో దేశం నలుమూలల నుంచి ఆర్మీ అధికారులు చేపట్టిన పాన్ ఇండియా మోటార్ సైకిల్ దక్షిణ యాత్ర ఆదివారం అనంతపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో కలెక్టర్ వినోద్‌కుమార్ అనంతపురం నుంచి జమ్మూకాశ్మీర్‌లోలోని ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ చేరుకునే ఈ యాత్రను సోమవారం ఉదయం స్థానిక పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో జెండాను ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం ఎంతో మంది జవాన్లు ప్రాణాలు త్యాగం చేసి దేశానికి కార్గిల్ యుద్ధ విజయాన్ని అందించారన్నారు. కార్గిల్ విజయ్ దివస్ 26వ తేదీతో రజతోత్సవం జరుపుకుంటుందన్నారు. వీరులను స్మరించుకుంటూ దేశం నలుమూలల యువత, మాజీ సైనికులు, ప్రజల్లో దేశభక్తి, కార్గిల్ వీరుల స్ఫూర్తిని నింపడం కోసం ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలో దేశం నలుమూలలా ధనుష్కోడి, ద్వారకా, డింజెన్, ఢిల్లీ నుంచి కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్ డి-5 మోటర్ సైకిల్ యాత్ర ప్రారంభమైందన్నారు. ఈ నెల 26న జమ్మూకాశ్మీర్‌లోని ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ చేరుకొని కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ మహోత్సవాలను ఇండియన్ ఆర్మీ జరుపుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె ప్టెన్ ఉమామహేశ్వరరావు, సార్జెంట్ సంజీవకుమార్, సుబేదార్ మహమ్మద్ ఇర్షాద్, జూనియర్ వారెంట్ ఆఫీసర్ టీకే కృష్ణ, మాజీ సైనికులు ఆర్ఎస్ నాగరాజు, తిమ్మారెడ్డి, పెంచలయ్య, వై. ప్రసాద్, గొల్ల ఈశ్వరయ్య, బీఏ హుస్సేన్, అల్లాబక్ష్, సాయికుమార్, గిరీష్, బాబా ఫక్రుద్దీన్, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, కార్గిల్ మోటార్ సైకిల్ యాత్ర సమన్వయ అధికారి సుబేదార్ సిద్దప్ప పాల్గొన్నారు.

రేణుకాస్వామి కుటుంబానికి న్యాయం జరగాలి

» నటుడు కిచ్చ సుదీప్

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసుపై నటులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. దర్శన్ అరెస్టు తర్వాత తొలిసారి కిచ్చ సుదీప్ స్పందించారు. మీడియాలో వస్తున్న కథనాలతోనే ఎన్నో తెలుసుకుంటున్నామన్నారు. వాస్తవాలు వెలుగులోకి రావాలన్నారు. రేణుకాస్వామి భార్య, పుటబోయే బిడ్డకు న్యాయం జరగాలన్నారు. 'నేను ఓ సామాన్యుడిగా చెప్పేదేమంటే న్యాయంపై నమ్మకం పెరగాల్సి ఉంది' అని అన్నారు. నేను పోలీస్ స్టేషన్‌లో ఏం జరుగు తోందో చూడలేదన్నారు. ముఖ్యమంత్రి, పోలీసు వ్యవస్థ చేపడుతున్న చర్యలు సజావుగా జరగాలన్నారు. సినిమా రంగానికి న్యాయం జరగాల్సి ఉందన్నారు. అయితే సుదీప్ ఎక్కడా వివాదం లేకుండా వ్యాఖ్యానించారు.

నిష్పక్షపాత విచారణ జరగాలి : ఉపేంద్ర

నటుడు ఉపేంద్ర స్పందిస్తూ ఇదో హై ప్రొఫైల్ కేసు అని, నిష్పక్షపాతంగా విచారణ జరగాలని, రేణుకాస్వామి కుటుంబం న్యాయం కోసం ఎదురుచూస్తోందన్నారు. విచారణలు జరుగుతున్న పరిణామాలను పోలీసులు బాధిత కుటుంబంతో పంచుకోవాలని అది చట్టానికి లోబడి ఉండాలని అభిప్రాయపడ్డారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తరుణంలో లైవ్‌స్ట్రీమింగ్ ద్వారా విచారణలు చేపట్టడం సముచితమన్నారు. రేణుకాస్వామి కుటుంబానికి న్యాయం జరగాలన్నారు. కాగా దర్శన్ అరెస్టు అయినప్పటి నుంచి ఆయన కుటుంబీకులు ఎవరు స్పందించలేదు. ఫాదర్స్ డేను పురస్కరించుకుని దర్శన్ కొడుకు నీవు ఎప్పటికీ నా హీరో అంటూ సోషల్‌మీడియాలో అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన భార్య విజయలక్ష్మి నేరుగా రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. పలువురు సీనియర్ న్యాయ వాదులతో కలసి కేసు విషయమై చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. కాగా కేసులో ఆరోపితులైన 17మందిని పోలీసులు అరెస్టు చేశారు.

సీనియర్ సిటిజన్లకు అగర్వాల్‌లో ఉచిత వైద్య పరీక్షలు

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రిలో సీనియర్ సిటిజన్లకు ఉచితంగా వైద్య పరీక్షలు జరుపనున్నట్టు ప్రకటించారు. అగర్వాల్ ఆసుపత్రుల రీజనల్ ఇన్‌చార్జ్ రవిదొరైరాజ్ ఒక ప్రకటన విడుదల చేశారు. 50ఏళ్లు పైబడినవారందరికీ నగరంలోని 11 శాఖల ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు జరుపుతామన్నారు. ఈనెల 30వరకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ముందుగా 9594029222 ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మొక్కలు నాటిన క్రెడాయ్ ప్రతినిధులు

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు సోమవారం మొక్కలు నాటారు. క్రెడాయ్ బెంగళూరు చైర్మన్ అమర్ మైసూరు, జలసంరక్షణ నిపుణుడు ఆనంద్ మల్లిగౌడ్ పాల్గొన్నారు. దేవనహళ్ళి బ్రిగేడ్ ఆర్కిడ్స్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సుమారు 500 మొక్కలు నాటారు. కనీసం ప్రతి ఒక్కరూ ఒక మొక్క సంరక్షణ బాధ్యత చేపట్టాలని అపార్ట్‌మెంట్‌వాసులకు సూచించారు.



మొక్కలు నాటుతున్న ప్రముఖులు

ఆశ్వాస్‌ను సందర్శించండి

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ఒత్తిడితో గడిపే ప్రజలు ప్రశాంతంగా సేద తీరేందుకు అవసరమైన పరుపులు, దిండ్లు ఎంపిక కూడా ముఖ్యమని సంజయ్‌నగర్‌లోని ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ ఆశ్వాస్‌ను సందర్శించాలని రెస్టోలెక్స్ సంస్థ ఎండీ దివాకర్ మెనన్ అభిప్రాయపడ్డారు. సోమవారం ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను ఆరంభించారు. డైరెక్టర్ దవీద్ కురువిల్లా సీఈఓ సురేశ్‌బాబు పాల్గొన్నారు. దవీద్ మాట్లాడుతూ 40ఏళ్లుగా రెస్టోలెక్స్ వినియోగదారులకు అవసరమైన ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నామన్నారు. నగరంలో 6శాఖలు ఉన్నాయన్నారు.

